# ఎకానమీ

సిగరెట్ నోట్లో పెట్టుకుని, వారపత్రిక తిరగవేస్తో. భార్య కట్టిఇచ్చిన తాంబూలంతోపాటు కొంతజర్దాకూడా బిగించి, దాని కోపక్క బుగ్గలో ఆశ్రయమిచ్చి, ఈజీ ఛైరులో ఆసీనుడైవున్న కృష్ణారావుని "ఏమన్నీ!" అంటూ, పనులుముగించి తడి చేతులు చీరకితుడుచుకుంటూ, అతనిభార్య శ్యామల పిలిచినపిలుపు, ఇహలోకస్ఫురణ కలిగించి, పుస్తకాన్ని మూయించి, ఆవిడ గారివైపు అరమోడ్పు గావీక్షించేలా చేసింది

"ఏమిటండీ?"

"పోదురూ! ఎప్పుడు ఏ విషయం మాటాడదామని దగ్గరచేరినా ఇలాగే అంటారు"

కోపంనటిస్తూ ప్రక్కనున్న మరో కుర్చీలో కూచుని, సాలోచనగా వేలికొనకు చీరచెరగును మెలివేయ సాగింది.

"సెలవియ్యండీ"

అని అతను మళ్ళా అన్నాడు. శ్యామల ఓకోరచూపు చూసింది, చిరుకోపంతో

"వేళాకోళంకాదు ఏదైనా సీరియస్ గా చెప్పేటప్పుడు శ్రద్ధగా వినాలి. మీరుచెప్తే నేను విననూ? లేకపోతే నేనసలు చెప్పేదే లేదు నాకొక్కదానికే కాదుగా సంసార తాపత్రయం పట్టింది? వినకపోతే జరిగేదేదో జరుగుతుంది."

నిర్లక్ష్యంగా అంది. కృష్ణారావు వారపత్రికను పక్కనున్న బల్లమీద పడేశాడు.

"విన్నవించుమంటే అంత కోపమెందుకండీ?"

"ఎందుకూ అనవసరంగా ఆ గౌరవవాచకం ప్రయోగిస్తారు, వ్యంగ్యార్థం కాకపోతే? 'చెప్పేదేదో చెప్ప అదేలాగా జరగదులే' అనడం అన్నమాట"

కోపంలోనే చిరునవ్వు, చూచాయగా ముఖంపైన మెరిసి మాయమైంది—'కనిపెట్టేశాను మీ లోగుట్టు; తెల్సుకోండి, నా ప్రభావం' అన్నట్టు.

"ప్రేమలో గౌరవవాచకం వాడినా తప్పులేదు. అదీగాక స్త్రీలకు సమాన హక్కులు కావాలంటున్న ఈరోజుల్లో 'ఏమండీ' అని భార్యల్ని పిలవడం సంస్కారవంతుల కనీస ధర్మం" కృష్ణారావు గుక్క తిప్పుకోకుండా చెప్పసాగాడు.

"ఆపండి ఆ ఉపన్యాసం తక్కిన స్త్రీల విషయం నాకు తెలీదుగాని, నేనుడిపుణ్యమా అని నన్ను అలాపిలవకండి మీ పెద్దలకో నమస్కారం"

"ఇంతకీ నీవనేదేమిటి?"

"మీ రననిస్తేగా?"

"అనమనే అనేది"

"విని వొప్పుకుంటానని మాటఇస్తారా?"

"వింటే కద?"

"వింటారుగా?"

"అసలు విషయమేమిటో?"

"మన కుటుంబంసంగతే!"

"విని, వీలుంటే వొప్పుకుంటాను"

"అదుగో, మళ్ళీ షరతులు పెడుతున్నారు?"

## శాంతి కృష్ణమూర్తి

"అది నాకసాధ్యమైనదైతే?"

"అసాధ్యమైనవి నే నెందుకడుగుతానండీ? ఏమన్నా పిచ్చిదాన్ననుకున్నారా?"

"అయితే చెప్ప"

"చేస్తారుకదూ?"

"చేస్తా...వీలుం..."

"ఎల్లుండి అమ్మాయి పుట్టినరోజు పండుగ ఆరోజు పూళ్ళో అందర్నీ పేరంటానికి పిలవాలనివుంది మీరు కొట్టులో ఖాతా పెట్టో, అప్పుతెచ్చో దానికోగాను, ఒకవీశె నెయ్యి, ఒకవీశె చక్కెర, శేరు సెనగపిండి, జీడిపప్పు, కిస్ మిస్ వగైరా తేవాలి. ఎల్లుండికి రెండురూపాయల సెనగలూ, ఓ వంద తమలపాకులూ, నాలుగు డజన్ల అరటిపళ్లూ కావాలి"

"చాలా పెద్ద పద్దే వుందే? ఈ నెలాఖర్చుతో ఇంత లిస్టుని పూర్తి చెయ్యడమెట్లా? దానికి ఏడేళ్లొచ్చాయికదా, ఇంకా పుట్టినరోజు పండుగ లెందుకూ?"

"అన్నారూ? నేను అలా అంటారనే అనుకున్నాను. డబ్బు ఖర్చవుతుందని పండుగా, పబ్బమూ మానేసుకుంటామండీ? షష్టిపూర్తి అయినా పుట్టినరోజు పండుగలు చేసుకుంటున్నారే, పది రూపాయల ఖర్చు కోసం వద్దంటున్నారా?"

శ్యామల ప్రాధేయపూర్వకంగానే అంది.

"రూపాయలకోసం కాదు; అసలు నాకు పుట్టిన రోజు పండుగల్లోనే నమ్మకం లేదు"

"ఎలుండి అమ్మాయి పుట్టినరోజు కాదంటారా?"

"అవ్వచ్చు"

"అయితే దానిలో నమ్మకం లేక పోవడమేమిటి?"

"పుట్టిన రోజులో కాదు; పండుగలో లేదన్నా."

"అదేం వీల్లేదు ఇది ఆడవాళ్ళ విషయానికి సంబంధించినది. ఆ మాత్రం స్వయం నిర్ణయాధికారం మాకూ వుంది మీరు చెప్పిన సరుకులు తెచ్చి పడేయండంతే!"

"నెలాఖరులో పది రూపాయలు మాత్రం?"

"అప్పు చెయ్యండి"

"తీర్చే విధానం?"

"ఎలాగో అలా తేండి. మీకు ఆవేళ రాత్రే ఆ డబ్బు ఇస్తాను, సరా?"

"ఎట్లా ఇస్తావ్?"

"మీరే చూద్దురుగాని"

"అయితే సరే"

అప్పటికి శ్యామల మనస్సు కుదుటపడింది. దీర్ఘంగా నిట్టూర్చింది

"ఎందుకా నిట్టూర్పు?"

"ఎంతగా వాదించారు-అంతా నా మేలు చేస్తున్నట్టు"

"నా కిష్టంలేక కాదు-బడ్జెట్ లేదుగా" చిరునవ్వు నవ్వాడు; విషాదకరంగా.

శ్యామలా నవ్వింది "ఇండియా ఆర్థిక మంత్రిత్వ స్థానం ఖాళీ అయింది ఆ స్థానం సంపాదించండి-మీ చేతినుండి డబ్బు రాలక పంచవర్ష ప్రణాళిక పడుక్కుంటుంది"

"ఏమో దశ ఎలా మారుతుందో? ప్రస్తుతము ఐ ఏ ఎస్ కి కడుతున్నాంగా?"

ఇంతలోకి అమ్మాయి నిద్దట్లో కలవరించ సాగింది. శ్యామల లేచివెళ్లి, జోకొడుతూ

# ★ ఎకానమీ ★

"నే చూస్తాన్లే, అమ్మా, నీ పుట్టినరోజు పండుగ. ఎందుకు జరగదో ?...ఏమండోయ్, ఆ లైట్ ఆర్పండి, అమ్మాయికి దోమలు కుడుతున్నాయి" అంది.

"చిత్తం, దేవిగారూ" అంటూ కృష్ణారావు లేచాడు. శ్యామల మనస్సులో నే నవ్వుకోసాగింది.

* * *

పుట్టిన రోజు పండుగ దివ్యంగా జరిగింది. ఆ వేళ సాయంత్రం ఇంటినిండా వనితాలోకం వుంటుందని ఆఫీసునుండే బజారు వైపు వెళ్లాడు కృష్ణారావు

అతను తిరిగి తిరిగి వొచ్చేటప్పటికి ఎనిమిదైంది. ఇల్లంతా సుగంధ ద్రవ్యాల్తో గుబాళిస్తోంది అక్కడక్కడ రాలిన అక్షింతలూ, సెనగలూ పేరంటపు వైభవాన్ని చాటుతున్నాయి.

శ్యామల సిల్కు బట్టలు వొదల్లేదు. అతని దుస్తుల్ని అందుకుని స్టాండుకి తగిలించింది

"అమ్మాయి, నాన్నారికి దణ్ణంపెట్టు! అంటూ చూసి చూసి నిద్దరోయింది" అంది శ్యామల, తను నమస్కరిస్తూ.

నువ్వెందుకు నమస్కరించడం నీ పుట్టిన రోజు కాదుగా" అన్నాడు కృష్ణారావు

"నా కూతురి బదులు"

భోజనం దగ్గర ప్రత్యక్షమైన మిఠాయి, పాతాళించిన సెనగలూ, అరటిపండ్లతో అనుకోకుండానే ఎక్కువ తిన్నాడు కృష్ణారావు.

పనులు పూర్తి చేసుకొచ్చాక శ్యామల, "మీకెంత ఖర్చయిందన్నారు?" అని అడిగింది.

"11—14—0"

"అయితే ఈ 12 రూపాయలూ తీసుకోండి. మీరు అమ్మాయి పుట్టిన రోజు పండక్కి ఏమీ ఖర్చు పెట్టలేదని జ్ఞాపకముంచుకోండి" అంది సగర్వంగా.

"ఎక్కడిదీడబ్బు?"

"పేరంటాళ్లిచ్చారు. ఇదిగో మరో అయిదు"

"ఎందుకు తీసుకున్నావ్?"

"అమ్మాయికి ప్రెజెంట్ చేశారు"

"బాగానే వుంది; ఐదు రూపాయలు అదా అన్నమాట మంచి ఎకానమీయే" అన్నాడు కృష్ణారావు నవ్వుతో.

* * *

"మరో సంవత్సరం గడిచింది. అమ్మాయి పుట్టిన రోజు రేపనగా కృష్ణారావు 'భార్య ఆ విషయం అడగదేమా?' అన్న ఆలోచనలో పడ్డాడు.

చూసి చూసి చివరికి అతనే అన్నాడు:

"రేపు అమ్మాయి పుట్టినరోజు జరపవూ?"

"జరుపుతాను"

"సెనగలూ, మిఠాయీ, గౌనూ అన్నీ బజారులో నే కొని తెస్తానులే"

"అవేం వొద్దులెండి ఒక్క గౌను తెస్తే చాలు."

"ఏం," అలా అంటున్నావ్? ఇందులో మనకేమీ తగిలేదిలేదుగా. పేరంటాళ్లనుండి బాగా నే వసూలౌతుందికదూ" ఉత్సాహంతో కృష్ణారావు మరీమరీ హెచ్చరించసాగాడు

"వద్దన్నాగా"

"ఇకే ఆడవాళ్లతో చిక్కు. అవునంటే కాదంటారు, కాదంటే అవునంటారు"

"మీకు తెలీదు ఊరుకుందురూ?"

"అలా వీల్లేదు దాని పుట్టినరోజు పండుగ చేసి తీరాల్సిందే?"

"వద్దుబాబూ వద్దు"

"ఏం ఎందుకు వద్దు? అమ్మాయి మీద నాకు ప్రేమ లేదనుకున్నావా! నిరుడు ఏదో తమాషాకన్నానంతే-నీహృదయం కనుక్కుందామని. అందుకల రేపు పొద్దున్నే వెళ్లి అందర్నీ పిలిచి పండుగ మామూలుగా చెయ్యి. నేను అన్నీ తెచ్చి పడేస్తాను"

"ఈ లిస్టుచూసి మరీమాట్లాడండి" అని శ్యామల ఓ కాగితం అందించింది. కృష్ణారావు చదువుకుని వివర్ణుడవసాగాడు. చివరికి కాగితం కింద వొదిలేశాడు, కుర్చీలో కూలబడుతూ.

"ఏమంటారు?" అంది శ్యామల.

"సరేలే నీయిష్టం" అని కృష్ణారావు చప్పబడ్డాడు.

ఆ కాగితంలో ఇలావుంది —

| | |
|---|---|
| డిప్టీకలెక్టరు గారింట్లో పేరంటంలో ఇచ్చినవి ... ... | 5-0-0 |
| తహశీల్దార్ ... ... | 5-0-0 |
| హెడ్‌మాష్టర్ ... ... | 5-0-0 |
| అసిస్టెంట్ సివిల్ సర్జన్ ... ... | 5-0-0 |
| లేడీ డాక్టర్ ... ... | 3-0-0 |
| ఇతరస్నేహితురాళ్ల ఇళ్ళల్లో... | 20-0-0 |
| మొత్తం. ... | 43-0-0 |
| మనకువచ్చినది.— | 17-0-0 |
| నెరసి నష్టం. | 26-0-0 |

"అమ్మాయికి ఓగౌను తెండి చాలు. మన ఇంట్లో నే జరుపుకుందాం పుట్టిన రోజు పండుగ సరదాగా" అంది శ్యామల ఓదార్పుగా.

★





నారసింహ లేహ్యము

బంగారుతో చేరినది మేహము క్కాళ, విస్ఫుత్తువ వగైరా హరించి బలము రక్తవృద్ధి కల్గించును 20తు. డబ్బీ రు. 3-4-0 పోస్టేజి అ 1-1-0

పి. సి ఎ అండ్ కో., (ఆయుర్వేద సమాజం)
పెరిదేపి (పోను) — నెల్లూరుజిల్లా.

జ్వరేగ్

క్యాటలాగ్ ఉచితము
సోల్ ఏజంట్లు యునైటెడ్ కన్సర్న్, మదరాసు-1
బ్రాంచీలు హైదరాబాదు & విజయవాడ.

END GREY HAIR

రంగులనుచూచి మోసపోవద్దు. అది తాత్కాలికము మా సువాసనగల "మన్ మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది 60సం॥ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు బలమిచ్చును. ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. జ్ఞాపకశక్తిని కంటిచూపును వృద్ధిచేయును కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు 3-8-0 3 సీసాలు రు. 9-0-0 సగము నెరసివుంటే ఒక సీసా రు. 5-0-0. 3 సీసాలు రు. 12/- పూర్తిగ నెరసింపుతే ఒకసీసా రు. 7/-లు 3 సీసాలు రు. 1/8-లు

I. D. Gupta & Co. (M)
147. Jhowtala Road, Calcutta - 17.




తామర, గజ్జి మరియు దురదలకు
ఆంధ్రదేశానికి ఏజెంట్లు:
ది ట్రేడ్ ప్రమోటింగ్ కార్పొరేషన్.
విజయవాడ - 2. RPC